క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

ఇచ్చోడ: మండలంలోని కస్తూరిబా బాలికల కళాశాలలో ఖాళీగా ఉన్న గెస్ట్ ఫ్యాకల్టీ మ్యాథమెటిక్స్, నర్సింగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రత్యేకాధికారి మల్లిక తెలిపారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. అర్హులైన అభ్యర్థులు ఈనెల 28, 29 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు బయోడెటా ఫాంను కళాశాలలో సమర్పించాలని కోరారు. మ్యాథమెటిక్స్ కోసం బీఎస్సీ మ్యాథ్స్, బీఈడీ, టీఈటీ క్వాలిఫైడ్ అయి ఉండాలన్నారు. నర్సింగ్ కోసం బీఎస్సీ, ఎమ్మెస్సీ నర్సింగ్ క్వాలిఫైడ్ ఉండాలని కోరారు.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఆదిలాబాద్‌టౌన్: ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని కళాశాల గ్రీన్‌క్లబ్ ఇన్‌చార్జి మంజులత అన్నారు. జిల్లా కేంద్రంలోని వ్యవసాయ కళాశాలలో శనివారం వనమహోత్సవం నిర్వహించారు. అధ్యాపకులు, విద్యార్థులు, సైంటిస్ట్‌లు వివిధ రకాల మొక్కలను నాటి నీరు పోశారు. విద్యార్థులు పర్యావరణం పట్ల అవగాహన పెంచుకొని మొక్కలు నాటాలన్నారు. ప్రతిఒక్కరూ కనీసం నాలుగు మొక్కలను నాటి సంరక్షించాలని సూచించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ శ్రీధర్ చౌహన్, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రామ్ గోపాల్ వర్మ, రాజశేఖర్, ప్రవీణ్ కుమార్, కుమారస్వామి, సునీల్ కుమార్, అనిల్ కుమార్, జయచంద్ర పాల్గొన్నారు.

రాజ్‌గోండ్ సేవా సమితి సంయుక్త కార్యదర్శిగా ఆనంద్‌రావు

ఆదిలాబాద్‌రూరల్: రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా ఆదిలాబాద్ రూరల్ మండలంలోని కేబీ కాలనీకి చెందిన సెడ్మకి ఆనంద్‌రావు నియమితులయ్యారు. శనివారం సమితి రాష్ట్ర అధ్యక్షుడు సోయం బాపురావు చేతుల మీదుగా ఆదిలాబాద్ పట్టణంలోని ఆయన నివాసంలో నియమాక పత్రం అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు సిడాం అర్జు పటేల్, కుమ్ర శ్యాంరావ్, కుమ్ర రాజు పటేల్, కుర్సేంగే తానాజీ, సార్ మేడి ఆత్రం పరుశురాం, తదితరులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయించొద్దు



తనిఖీ చేస్తున్న తహసీల్దార్ లక్ష్మి

తాంసి: క్రిమిసంహారక మందులను రైతులకు అధిక ధరలకు విక్రయించవద్దని, తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని తహసీల్దార్ లక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పలు సీడ్స్, పెస్టిసైడ్ షాప్‌లను తనిఖీ చేశారు. ఆయా షాప్‌లలో నిల్వ చేసిన స్టాక్ వివరాలు పరిశీలించారు. ప్రభుత్వం నిషేధించిన వివిధ రకాల మందులతో పాటు గడ్డి మందులను అమ్మకాలు చేయవద్దని సూచించారు. నిషేధిత మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వారి వెంట జూనియర్ అసిస్టెంట్ రాఘవేంద్ర, షాప్ యాజమానులు శ్రీకాంత్, అరుణ్, తదితరులు ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మిల్కా

బోథ్: సొనాల మండలంలోని మహాదూగూడ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఊరుస్తుండడంతో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. శనివారం జిల్లా సంక్షేమ అధికారి మిల్కా కేంద్రాన్ని పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆదేశించినట్లు తెలిపారు. అవసరమైతే తాత్కాలికంగా అద్దె భవనంలోకి మార్చుతామన్నారు. ఆమె వెంట సూపర్‌వైజర్, అంగన్‌వాడీ కార్యకర్త ఉన్నారు.

సీఆర్టీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు

ఉట్నూర్‌రూరల్: తెలంగాణ సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఆదివారం నిర్వహించే కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల పరీక్షకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు ఉట్నూర్ తహసీల్దార్ బి.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025- 26 విద్యా సంవత్సరానికి తెలంగాణ సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో కాంట్రాక్టు రెసిడెన్షియల్ టీచర్ల పోస్టుల భర్తీ కోసం పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని కేబీ కాంప్లెక్స్ వద్ద 5 గురు అంతకంటే ఎక్కువ మంది ఉండవద్దన్నారు.

ఆహ్లాదం.. ఆనందం



సాత్నాల ప్రాజెక్ట్

- పచ్చని కొండల మధ్య సాత్నాల ప్రాజెక్ట్
- జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరంలో..
- బోటింగ్ ఏర్పాటు చేయాలని కోరుతున్న స్థానికులు

సాత్నాల: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజలు వీకెండ్ వచ్చిందంటే మంచి పిక్నిక్ స్పాట్‌కి వెళ్దామని అనుకుంటారు. కుంటాల, గాయత్రి జలపాతాలను ఎక్కువగా విజిట్ చేస్తుంటారు. జిల్లా కేంద్రానికి 18 కిలోమీటర్ల దూరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండే సాత్నాల ప్రాజెక్టు పర్యాటకులను ఆకట్టుకుంది.

ఆకట్టుకునే అందాలు..

సాత్నాల ప్రాజెక్టు పెన్‌గంగ నదికి ఉపనది అయిన సాత్నాల వాగుపై నిర్మించారు. సాత్నాలు అంటే ఏడు వాగుల సామూహము అని అర్థం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అదిలాబాద్ జిల్లా రైతాంగానికి సాగు నీరు అందించేందుకు 17 డిసెంబర్ 1976 సంవత్సరంలో రూ. 3.22 లక్షలతో నిర్మించారు. 24 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తోంది.



ప్రాజెక్ట్ నుంచి విడుదల అవుతున్న నీరు

ప్రాజెక్టు నీటి నిల్వ ఒక టీఎంసీ.

- ఆహ్లాదకరమైన వాతావరణం.. చుట్టూ పచ్చని కొండలు, కనుచూపు మేర నీరు, నేటి యాంత్రిక జీవనంలో ప్రకృతి ఒడిలో సేద తీరాల అనుకునే వారికి ఇది మంచి పర్యాటక కేంద్రం. ఇక్కడి ప్రజలు వచ్చి ఆహ్లాదకరంమైన వాతావరణంలో సేదతీరుతారు.

అభివృద్ధి చేయాలి



ఎన్నో ఏళ్లుగా వెనుకబడిన ప్రాంతం అని, ఆదివాసీలు, గిరిజనులు ఎక్కువగా ఉండే ప్రాంతంలో సాత్నాల ప్రాజెక్టు ఉంది. దీనిని అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. ఇకనైనా నాయకులు, అధికారులు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి. –అల్చెట్టి స్వామి, మాంగుర్ల

వసతులు లేవు



మినీ పార్కు, బోటింగ్ ఏర్పాటు చేస్తే పర్యాటకుల తాకిడి ఉంటుంది. ఇప్పటికే వీకెండ్‌లో చాలా మంది పర్యాటకులు అధికంగా వస్తుంటారు. ఇక్కడ సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నాం. అధికారులు స్పందించి వసతులు కల్పించాలి. – శివప్రసాద్ రెడ్డి, మేడిగూడ

మినీ పార్క్, బోటింగ్ ఏర్పాటు చేస్తే..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రజలు వీకెండ్లలో పెద్ద ఎత్తున ప్రాజెక్ట్ సందర్శనకు వెళ్తారు. మినీపార్క్, బోటింగ్ ఏర్పాటు పర్యాటకులు పెరగడంతో పాటు, స్థానికులకు ఉపాధి కూడా లభిస్తుంది. జిల్లా కేంద్రంలోని పరిసర ప్రాంతాల్లో బోటింగ్ సౌకర్యం ఎక్కడా లేదు. ప్రజాప్రతినిధులు, అధికారులు ఇకనైనా స్పందించి నూతనంగా ఏర్పడిన సాత్నాల మండలాన్ని అభివృద్ధి చేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా కార్గిల్ విజయ్ దివస్

బోథ్: మండలంలోని నాగభూషణం పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్‌ను శనివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు దేశసైనికుల వేషధారణలో పాల్గొని అమర జవాన్లకు సెల్యూట్ చేస్తూ నివాళులర్పించారు. విద్యార్థులు దేశ రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన సైనికుల త్యాగాన్ని స్మరించుకున్నారు. దేశం కోసం వీరమరణం పొందిన వీర సైనికుల సాహసాన్ని వివరించే కార్యక్రమాలు నిర్వహించారు. దేశభక్తి గీతాలాపన చేశారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

బేల: మండల కేంద్రంలోని శివాజీ చౌరస్తాలో శనివారం భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో కార్గిల్ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భరతమాత చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేశారు. అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. అమరవీరులకు జోహర్లు, భరతమాతకు జై అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో భజరంగ్‌దళ్ మండల అధ్యక్షుడు అగర్కార్ ఆకాష్, కార్యదర్శి ప్రీతం, సభ్యులు ఉర్వతే సచిన్, బర్కాడే రాము, రూపేష్, వంశీ, కార్తీక్ పాల్గొన్నారు.



జవాన్‌ల వేషధారణలో విద్యార్థులు

బోథ్: దేశ రక్షణ కోసం సైనికుల సేవలు మరువలేనివని మాసం లక్ష్మీవెల్ఫేర్ సొసైటీ చైర్మన్ మాసం అనిల్ కుమార్ అన్నారు. శనివారం కార్గిల్ దివస్ పురస్కరించుకొని సైనికులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ సభ్యులు భగత్ ప్రవీణ్, కడేరుగుల రాజశేఖర్, జిల్లేడ శ్రీధర్, సాయి గణేష్, సిద్ధు, రవి పాల్గొన్నారు

వసతులు కల్పించేందుకు చర్యలు

నార్నూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని డీఐఈవో రాథోడ్ గణేశ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. కళాశాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ సంఖ్య పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విద్యాబోధనలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కేశవులు, అధ్యాపకులు కాంబ్లే బాలాజీ, నరేశ్ పాల్గొన్నారు.



సమావేశమైన డీఐఈవో రాథోడ్ గణేశ్

సంక్షిప్త వార్తలు

- **మాజీ ఎంపీని కలిసిన కాంగ్రెస్ నాయకులు**

నేరడిగొండ: కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు, ఆదిలాబాద్ మాజీ ఎంపీ సోయం బాపురావును శనివారం ఆదిలాబాద్‌లోని ఆయన నివాసంలో కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆయనను బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు ఆడే వసంత్‌రావు, జిల్లా నాయకులు ఏలేటి రాజశేఖర్ రెడ్డిలు శాలువాతో సత్కరించారు.

- **పరామర్శ**

బజార్‌హత్నూర్: మండలంలోని వర్తమన్నూర్ గ్రామానికి చెందిన జవాను నలువల ఆకాశ్ ఇటీవల విధుల్లో ఉండగా అకస్మికంగా మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ శనివారం గ్రామానికి చేరుకొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

- **రోడ్డు మార్గాన్ని బాగు చేయండి**

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి నుంచి గొల్లఘాట్ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గం పూర్తిగా బురదమయంగా మారింది. దీంతో రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనదారులు వాపోయారు. రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు.

- **పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం**

నేరడిగొండ: వ్యక్తిగత, పరిసరాల శుభ్రతతోనే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్ అన్నారు. శనివారం మండలంలోని కుప్టి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు గ్రామస్తులకు పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. హెల్త్ అసిస్టెంట్ సాయన్న, ఏఎన్ఎం రాణి, ఆశ కార్యకర్త గంగామణి, పుష్ప పాల్గొన్నారు.

- **అభ్యర్థులకు ప్రత్యేక బస్సులు**

ఆదిలాబాద్: ఉట్నూర్‌లో శనివారం సీఆర్టీల నియామకం కోసం నిర్వహించనున్న పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల కోసం మండల కేంద్రాల నుంచి ఉట్నూరుకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న జీపీవో పరీక్షకు హాజరయ్యే అభ్యర్థుల సౌలభ్యం కోసం మండల కేంద్రాల నుంచి ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు పేర్కొన్నారు.

- **వ్యవసాయాధికారిగా జాదవ్ కైలాష్**

సాత్నాల: మండలంలోని మెడిగుడ రైతువేదికలో శనివారం మండల వ్యవసాయ అధికారిగా జాదవ్ కైలాష్ బాధ్యతలు చేపట్టారు. నూతన మండలం ఏర్పడినప్పటి నుంచి ఇన్‌చార్జి ఏవోలతో కాలం వెళ్లదీశారు. ఎట్టకేలకు రెగ్యులర్ ఏవోను నియమించడంతో మండల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- **చెత్త నిల్వ చేసిన వ్యాపారికి జరిమానా**

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణంలోని ఎన్టీఆర్ చౌక్‌లో షేక్ షారుక్ అనే వ్యాపారి రోడ్డుపై మొక్కజొన్నలు విక్రయించాడు. ఆ చెత్తను పడేయకుండా అక్కడే రోడ్డు పక్కన నిల్వ చేశాడు. ఉదయం ఆ చౌక్‌లో పర్యటించిన బల్దియా సానిటరీ ఇన్‌స్పెక్టర్ బైరి శంకర్ నిల్వ ఉంచిన చెత్తను తొలగించాలని సదరు వ్యాపారికి సూచించారు. అందుకు అంగీకరించిన వ్యక్తి సాయంత్రం వరకు చెత్తను తొలగించకుండా అక్కడే ఉంచారు. దీంతో రూ.వెయ్యి జరిమానా విధించి ఆ చెత్తను తొలగింపజేశారు.

- **పాత ఏజెన్సీనే కొనసాగించాలి**

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా టెండర్లు పిలిచే వరకు కృష్ణ ఏజెన్సీనే కొనసాగించేలా, జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో మాట్లాడి కార్మికులకు వేతనాలు ఇప్పించేలా చూడాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఏఐటీయూసీ, సీఐటీయూ, బీఆర్‌టీయూ సంఘాల జేఏసీ నాయకులు శనివారం కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.

- **ఇంద్రవెల్లిలో ముసురు**

ఇంద్రవెల్లి: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా ముసురు కురుస్తుంది. సుందర్‌నగర్, భగత్‌సింగ్, చిత్తబట్ట, మామిడిగూడ, ఖైర్‌గూడ, సకారంతండా, పాల్లుగూడ గ్రామాల మట్టిరోడ్లు చిత్తడిగా మారాయి. శనివారం ఏఎన్ఎం విజయసుందరి తోటి వైద్య సిబ్బందితో మూడు కిలోమీటర్లు కాలినడకన వెళ్లి సకారంండా గ్రామంలోని రోగులకు వైద్యం అందించారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి

ఇంద్రవెల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు రాథోడ్ రితేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు కేంద్రే బాలాజీ ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌కు హజరయ్యారు. కష్టపడి పని చేసి ఎన్నికల్లో గెలుపొందాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ ఆరెల్లి రాజలింగు, నాయకులు రాథోడ్ భీంరావ్, కనక హనుమంత్‌రావ్, కోవ రాజేశ్వర్, దీపక్‌సింగ్ షెకవత్, దేవ్‌పూజే మారుతి, రాథోడ్ రాధిక, ముండే సాయినందన్ పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

బోథ్: మండల కేంద్రంలోని ప్రభుత్వ సీహెచ్‌సీ ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా నియమితులైన కె. రవికుమార్, అలాగే బోథ్ గ్రామానికి చెందిన వైద్యులు శబరిరామ్, మిథిలేష్‌ను బోథ్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా సన్మానించారు. వైద్యులకు గ్రామాభివృద్ధి కమిటీ తరఫున సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వీడీసీ అధ్యక్షుడు అల్లకొండ పోతన్న, ప్రధాన కార్యదర్శి సాయినాథ్ గౌడ్, కోశాధికారి రాయపెల్లి రమాకాంత్, సయ్యద్ యాసిన్, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.


'రాజకీయ లబ్ధి కోసం ఆదివాసీలను బలి చేయొద్దు'

నార్నూర్: రాజకియ లబ్ధి కోసం ఆదివాసీలను బలి చేయొద్దని, ఖబద్దార్ సోయం బాపూరావు అని తుడందెబ్బ జిల్లా అధ్యక్షుడు పెందూర్ దాదిరావు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కుమురంభీం భవన్‌లో మాట్లాడారు. రాజకీయ భవిష్యత్‌ను ఇచ్చిన సంఘంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు మెస్రం మానిక్‌రావు, అడ శ్రీరామ్, మాడవి ఆనందరావు, ఏత్మారామ్ పాల్గొన్నారు.

నాణ్యత పాటించాలి

నార్నూర్: ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో నాణ్యత పాటించాలని ఎంపీడీవో గంగాసింగ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్ జాడి రాజలింగుతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. సిమెంట్, స్టీల్, రాడ్స్, ఇసుకలను ఇందిరమ్మ లబ్ధిదారులకు తక్కువ ధరలకు అమ్మాలని సూచించారు. ఇసుక కోసం తహసీల్దార్ అనుమతి ఇస్తారన్నారు. సమావేశంలో ఎంపీవో సాయిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్ఈ జేఆర్ చౌహాన్

ఉట్నూర్‌రూరల్: విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ ఎస్ఈజేఆర్ చౌహాన్ విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. శనివారం ఉట్నూర్ మండలంలో పర్యటించారు. రైతులు, వినియోగదా రులతో మాట్లాడుతూ వర్షాలు పడుతునందున ఎక్కడ ఎలాంటి విద్యుత్ అంతరాయం ఉన్నా.. 1912కి సమాచారం ఇవ్వాలన్నారు. అనంతరం స్థానిక కార్యాలయంలో శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రమాదకరంగా ఉన్న వంగిన విద్యుత్ పోల్స్, వదులుగా ఉన్న లైన్స్, ఎత్తు తక్కువగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గద్దెలు, తక్కువ ఎత్తు ఉన్న లైన్స్ లాంటివి గుర్తించి వెంటనే సరి చేయాలన్నారు.

బీఆర్ఎస్ హయాంలోనే ఐటీరంగం అభివృద్ధి



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

ఇచ్చోడ: బీఆర్ఎస్ హయాంలోనే ఐటీరంగం అభివృద్ధి చెందిందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐటీ రంగాన్ని పూర్తిగా విస్మరించడంతో నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లేకుండా పోయాయని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని రాయల్ ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన జాబ్‌మేళాను ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగ యువతకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు రాకుండా పోయాయన్నారు. నియోజకవర్గంలో యువతీ, యువకుల కోసం హైదరాబాద్‌లో 62 ప్రముఖ కంపెనీలను జాబ్‌మేళాకు రప్పించినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరికీ ఉపాధి అవకాశాలు కల్పించే బాధ్యతగా తన వంతు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో నోటిఫికేషన్లు వేసి భర్తీ చేసిన పోస్టులకు కాంగ్రెస్ ప్రభుత్వం నియమాక పత్రాలు అందజేసి తామే ఉద్యోగాలు ఇచ్చినట్లు ప్రచారం చేసుకుందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క నోటిఫికేషన్ వేయలేదని విమర్శించారు. మాజీ మంత్రి జోగు రామన్న మాట్లాడుతూ.. వెనుకబడిన ఆదిలాబాద్ జిల్లాను సైతం ఐటీ రంగాంలో అభివృద్ధి చేసేందుకు జిల్లా కేంద్రంలో ఐటీ పార్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జాబ్‌మేళాకు 1400 మంది నిరుద్యోగ యువత వచ్చారు. కార్యక్రమంలో ఖానాపూర్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, మాజీ ఎంపీపీలు, మాజీ జెడ్పీటీసీలు, మాజీ ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారం కోసమే ప్రజాదర్బార్



సమస్యలు తెలుసుకుంటున్న కంది శ్రీనివాస్ రెడ్డి

కైలాస్‌నగర్: ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఆదిలాబాద్ నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణుల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిని పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని భరోసానిచ్చారు. అనంతరం తన కేఎస్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, మార్కెట్ కమిటీ చైర్మన్ అశోక్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ చైర్మన్‌కు సన్మానం..

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మల్లెపూల నర్సయ్య శనివారం కంది క్యాంపు కార్యాలయాన్ని సందర్శించారు. ఆయనకు పార్టీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయనను కంది శ్రీనివాస రెడ్డి పూలమాల, శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ ఇంటలెక్చ్వల్ ఫోరం ప్రతినిధులు కోరారు. శనివారం మున్సిపల్ కమిషనర్ సీవీఎన్. రాజును తన ఛాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రజలకు సరిపడా నీటి సరఫరా జరగడం లేదని, మిషన్ భగీరథ ద్వారా శుద్ధజలాన్ని అందించేలా చూడాలన్నారు. పలు కాలనీల్లో రోడ్లపై మురికినీరు నిలిచి తాగునీటి పైపుల్లోకి వెళ్తుందన్నారు. వీధి కుక్కల బెడద అధికంగా ఉందని, చిన్నారులు, వృద్ధులను కరుస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బి.మదన్ మోహన్, బాలసాని నారాయణ గౌడ్, ఊదారి నారాయణ, బేర శ్రీనివాస్, లింగయ్య, మోసిన్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



మాట్లాడుతున్న జీసీడీవో మెస్రం ఛాయ

నార్నూర్: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ, శాటిలైట్ సెంటర్‌లో చదివే విద్యార్థుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని జీసీడీవో మెస్రం ఛాయ అన్నారు. శనివారం గాదిగూడ మండలంలోని అర్జుని కొలాంగూడ శాటిలైట్ సెంటర్ సందర్శించి, రికార్డులు పరిశీలించారు. వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఆమె వెంట ఉపాధ్యాయులు కోవ అశోక్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన నేతలు

బోథ్: బీడీ కార్మికుల హక్కుల సాధన కోసం తమిళనాడు రాష్ట్రంలోని చెన్నై నగరంలో నిర్వహించనున్న ఆలిండియా బీడీ ఫెడరేషన్ కౌన్సిల్ సమావేశానికి బోథ్ మండల కేంద్రానికి చెందిన బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి. గోవర్ధన్ తరలివెళ్లారు. కనీస వేతనాలు, ఈపీఎఫ్, పెన్షన్ హక్కులు, బీడీ కార్మి కుల సంక్షేమ పథకాలు వంటి అంశాలపై సుదీర్ఘ చర్చలు జరగనున్నట్లు తెలిపారు. కార్మి కుల జీవన ప్రమాణాలు మెరుగుపరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తీసుకొచ్చేందుకు దేశ వ్యాప్తంగా పోరాటం చేస్తామన్నారు.

ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరండి

ఇచ్చోడ: రాజ్‌గోండ్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికై సోయం బాపురావు ప్రమాణ స్వీకారోత్సవానికి తరలిరావాలని ఆదివాసీ నాయకుడు పెందర్ నాగోరావు కోరారు. శనివారం ఇచ్చోడలో విలేకరులతో మాట్లాడారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎస్టీయూ భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆదివాసీలు, సంఘాల నాయకులు, అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

కార్యవర్గం ఎన్నిక

బజార్‌హత్నూర్: మండల కేంద్రంలో రామ్‌సేన్ యూత్ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూత్ అధ్యక్షుడిగా ఎడ్ల రాజు, ఉపాధ్యక్షుడిగా బత్తుర్ శేఖర్, దనగరి సాయికృష్ణ, కోశాధికారులుగా కీర్తి రాజు, దనగరి గణేష్, రైటర్‌గా గోసుల గణేష్, సలహా సభ్యులు కిరప్ప విఠల్, గాండ్ల రమేష్, కిరప్ప శ్రీనివాస్, కీర్తి సాయినాథ్, దనగరి సంతోష్, భగత్ శాంతమన్, సోషల్ మీడియా కన్వీనర్‌లుగా కోడెల గజేందర్, కిరప్ప కిరణ్లను ఎన్నుకున్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

భీంపూర్: ప్రజలు గుట్కా, పొగాకు, తంబాకు వంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మండల వైద్యాధికారి నిఖిల్ రాజ్ అన్నారు. శనివారం మండలంలోని గుంజాల, వడూర్ గ్రామాల్లో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్య విస్తరణాధికారి జ్ఞానేశ్వర్, పర్యవేక్షకులు రోహిదాస్, మాయావతి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు

బోథ్: మండల కేంద్రంలోని విఠలేశ్వర ఆలయంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేయనున్నట్లు ఆలయ పూజారి సదానంద శర్మ తెలిపారు. ప్రతీ సంవత్సరం నిర్వహించినట్లుగా గోత్రమాలతో రుద్రాభిషేకాలు, శివ పారాయణం, అన్నదానం నిర్వహిస్తామన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని శివారాధనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వేంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు

తలమడుగు: మండలంలోని బరంపూర్ సమీపంలో కొండపై వెలిసిన శ్రీ వేంకటేశ్వర ఆలయంలో శ్రావణమాసం మొదటి శనివారం పురస్కరించుకొని భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయంలో ఉదయం నుంచి సాయత్రం వరకు భజనా గీతలు ఆలపించారు. మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి, మాజీ ఎంపీపీ కళ్యాణ లక్ష్మి రాజేశ్వర్, లక్ష్మారెడ్డి, ప్రతాప్, ఆలయ కమిటీ సభ్యులు కేదరేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఆదిలాబాద్
99516 02888
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఆదిలాబాద్ : కె.రమేష్ - 8019715058
బోథ్ : ఖాజా మొయినొద్దీన్ - 7997958184
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899